క్లుప్తంగా

రేపు ఉచిత పశు వైద్యశిబిరం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని పశు వైద్యశాలలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించనున్నట్లు పశువైద్యశాల డెప్యూటీ డైరక్టర్ డాక్టర్ పి. రత్నశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో నల్ల, తెల్లజాతి పశువులు, ఎదకురాని పశువులు, తిరగపొర్లే పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. గుడివాడ పరిసర ప్రాంత పశు పోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నీటి ముంపులో వరి పొలాలు



తోట్లవల్లూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరినాట్లు నీటి ముంపులో చిక్కుకుంటున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పల్లపు ప్రాంతాలు, బాడవ పొలాల్లోని వరి నాట్లు వర్షపు నీటిలో మునుగుతున్నాయి. భారీగా కురుస్తున్న వర్షాలతో మాగాణి పొలాలు నీటి తటాకాల్లా దర్శనమిస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పల్లపు పొలాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షం నీటి ముంపులో వరినాట్లు చిక్కుకుని ఎక్కడ దెబ్బతింటాయోనని రైతులు కలవరపడుతున్నారు. ఇప్పటికే అనేక వ్యయ ప్రయాసల కోర్చి నాట్లు వేశామని, మళ్లీ వేయాలంటే తాము పెట్టుబడి పెట్టలేమని అంటున్నారు.

దివ్యాంగులకు భోజన వసతి



గుడివాడ టౌన్: భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ సేవాకార్యక్రమాల్లో భాగంగా బుధవారం దివ్యాంగ చిన్నారులకు భోజన వసతి కల్పించారు. పరిషత్ సభ్యుడు ఆదీష్ కుమార్ జైన్, ఆకాష్ జైన్ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వికాస్ పరిషత్ అధ్యక్షురాలు హారిక తెలిపారు. స్థానిక చౌదరిపేటలోని శిరీష డెవలప్‌మెంట్ స్కూల్లోని దివ్యాంగ చిన్నారులకు భోజన వసతితో పాటు పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యులు రూప్‌చంద్ జైన్, పి.సురేష్ పాల్గొన్నారు.

మత్తుపదార్థలతో అనర్థాలపై అవగాహన కల్పించాలి

పెదపారుపూడి: గ్రామాల్లో మత్తుపదార్థాల వలన జరిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించాలని పామర్రు సీఐ వి.సుభాకర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సచివాలయంలో కొత్తగా చేరిన గ్రామ మహిళా పోలీసులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి, సారా తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తుంటే స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రెయినేజీ నీరు రోడ్లపై నిలిచి అవస్థలు



మండవల్లి: మండవల్లిలోని ఛత్రపతి శివాజీ వీధి (కైకలూరు వీధి)లో డ్రెయిన్లు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ నీరు ఇళ్లలోకి రావడంతో పాటు, మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో మురుగు తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా శాశ్వత డ్రెయినేజీ (అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ) నిర్మించాలని అధికారులకు విన్నవించుకుంటున్నా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

రేపు జాబ్ మేళా

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని ఆదిత్య డిగ్రీ కళాశాల్లో ఈ నెల 25వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీ అయిన దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో 2021 నుంచి 2024, 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీ. ఫార్మసీ, ఎమ్మెస్సీ, ఎం. ఫార్మసీ అభ్యర్థులకు ఇది చక్కని అవకాశం అని పేర్కొన్నారు.



చోరగుడి వద్ద అధ్వానంగా మారిన రహదారి



ఆగినపర్రు రోడ్డు దుస్థితి

అడుగుకో గుంత.. ఆదమరిస్తే అంతే

ప్రమాదకరంగా మారిన రహదారులు

పమిడిముక్కల: మండలంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. అడుగుకో గుంత ఉండటంతో ప్రయాణం సాగక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గుంతల్లో వర్షం నీరు చేరి ఉండటంతో రోడ్లు కనబడక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వీరంకిలాకు-కూచిపూడి, పమిడిముక్కల-మేడూరు, కృష్ణాపురం-ఐలూరు, కృష్ణాపురం-చోరగుడి, కృష్ణాపురం-కూచిపూడి రోడ్లు గుంతలమయంగా మారాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలు పూడ్చుతామని చెప్పి ఇప్పటి వరకూ పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మేడూరు రోడ్డు

అధ్వానంగా ఐలూరు రోడ్డు

పమిడిముక్కల-కృష్ణాపురం రోడ్డు దుస్థితి

శాకంబరిగా అమ్మవారు

గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్ సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని బుధవారం శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించారు. వాసవి క్లబ్ విదర్భపురి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు చండీ హోమం

శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం మహాచండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు తెలిపారు. హోమం అనంతరం కబంధ ప్రసాదం వినియోగం (అన్నసమారాధన) ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావలెనని కోరారు.



శాకంబరిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయండి

కైకలూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగిన కైకలూరు మండల పరిషత్ సమావేశానికి గౌరవాధ్యక్షుడిగా కామినేని హాజరయ్యారు. ముందుగా ఎంపీపీ మండలంలో పాఠశాలల మరమ్మతులు, ఆర్వో వాటర్ ఫిల్టర్ల ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తుల వల్ల అధిక లోడులతో వాహనాలు తిరగడం వల్ల రోడ్లు త్వరగా పాడవుతున్నాయన్నారు. ఆగస్టు 8 నుంచి 15 తేదీల్లో కైకలూరు రోడ్లపై గోవులు కనిపిస్తే మరో ప్రాంతానికి వాటిని వాహనాల్లో తరలిస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, గంగుల వెంకట నరసమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

గంగానమ్మ గుడి వద్ద గుంతతో అవస్థలు



గంగానమ్మ ఆలయం సమీపంలో ఏర్పడిన పెద్ద గుంత

మండవల్లి: మండవల్లి వాటర్ ట్యాంక్ సమీపంలో కొలువై ఉన్న శ్రీ గంగానమ్మ ఆలయం సమీపంలో పెద్ద గుంత ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుండటంతో గంగానమ్మ ఆలయం వద్ద వందలాది మంది భక్తులతో జాతర జరగనుంది. దీంతో ఈ గుంత ఉంటే ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి గుంతను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్స్ పంపిణీ

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రులోని ప్రాథమిక పాఠశాల-1లో సుమారు 60 మంది విద్యార్థులకు దాతలు మధ్యాహ్న భోజన ప్లేట్స్, గ్లాసులను బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన అట్లూరి అచ్యుత రామారావు, సరోజని దంపతుల జ్ఞాపకార్థం ప్రవాస భారతీయులైన వారి మనుమరాళ్లు అట్లూరి ఐశ్వర్య, అనన్య వితరణగా అందించారు. హెచ్ఎం సీహెచ్ లక్ష్మీ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: గోసాలలో యువకుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం గోసాలకు చెందిన చిట్టూరి నాగేంద్రబాబు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులతో కలిసి క్యాటరింగ్ పనులు చేస్తాడు. నాగేంద్రబాబు పెద్ద కుమారుడు చిట్టూరి పవన్ ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో నాగేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.



పాఠశాల గేటు ఎదురుగా గుంతలో నిలిచిన వర్షం నీరు

రోడ్డుపై ఇలా.. బడిలోకి వెళ్లేది ఎలా?

తోట్లవల్లూరు మండల పరిషత్ ఆదర్శ పాఠశాల మెయిన్‌గేటు ఎదురుగా పెద్ద గుంత ఏర్పడింది. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతలో నీరు నిలిచి తటాకంలా దర్శనమిస్తోంది. దీంతో పాఠశాల లోపలకు వెళ్లాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్పించి ఇబ్బందులు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– తోట్లవల్లూరు

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

దోసపాడు(పెదపారుపూడి): మండలంలోని దోసపాడులోని కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు మండల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గోగం సురేష్ బుధవారం ఒక ప్రకటనతో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొనే ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

వెలుగు మిత్రల సమావేశం

మండవల్లి: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వెలుగుమిత్రల సమావేశం నిర్వహించారు. ఏపీఎం రాజశ్రీ చిన్న సంఘాల వార్షిక క్రెడిట్‌ప్లాన్, సంఘాల లావాదేవీలు, 2025 మార్చి 31 నాటికి కటాఫ్ డేటాపై అవగాహన, సూర్యఘర్ గురించి వివరించారు. సమావేశంలో వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15లోపు పంటల బీమా చెల్లించాలి

కూచిపూడి(మొవ్వ): ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టాలు జరిగినప్పుడు రైతులు లబ్ధి పొందాలంటే పంటల బీమా సకాలంలో చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. మొవ్వ మండలంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను బార్లపూడి, కూచిపూడి గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న సిబ్బంది మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి పసుపు పంటకు ఎకరానికి రూ.1,100, వరిపైరుకు రూ.830 ఇన్సూరెన్స్ ప్రీమియం ఆగస్టు 15వ తేదీ లోపు చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే పంట నమోదు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో వీఏఏఎం శ్రావణితో పాటు ఏఈఓ మురారి గురుఅంజలి, వీఏఏలు శ్రావణి, ఎస్.కవిత పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజం కోసం సహకరించండి

వానపాముల(పెదపారుపూడి): పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం పెద్ద మనసున్న మార్గదర్శకులు ముందుకొచ్చి సహకరించాలని ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వానపాముల, జమిదింటకుర్రు గ్రామాల్లో బుధవారం పీ-4 గ్రామసభలు నిర్వహించారు. ఈఓపీఆర్డీ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వానపాముల సర్పంచ్ పాతూరి రమేష్, పంచాయతీ కార్యదర్శి సాగర రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: నందివాడ మండలంలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నందివాడ, శ్రీనివాసపురం, తుమ్మలపల్లి, వెన్ననపూడి, తమిరిశ, జనార్దనపురం గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కైకలూరులో..

కైకలూరు: విద్యుత్ తీగలకు అడ్డువచ్చే చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కైకలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని జగనన్న హౌసింగ్ కాలనీ, కైకలూరు, దానిగూడెం, వైఎస్సార్ కాలనీ, కరకట్ట, జాన్ పేట, ఆటపాక గ్రామాలు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెం, చెవూరు, కోమర్రు, చెన్నూరు, కాకరవాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని తెలిపారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు పనిచేయండి



మండవల్లి మండల నాయకులను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) బుధవారం కోరారు. ఇటీవల ఏలూరు జిల్లా పార్టీలో వివిధ అనుబంధ కమిటీలో పలు హోదాల్లో నియామకాలు జరిగిన నాయకులను కై కలూరు పార్టీ కార్యాలయంలో అభినందించారు. వీరిలో మండవల్లి మండలానికి చెందిన గొంతు పులుగు వంశీ, అర్జ విజయదుర్గ, సాక జసంత, గుడివాడ వీర రాఘవయ్య, బోణం శేషగిరి, దాసరి శ్యామ్‌కుమార్, గోవాడ శేఖర్, బొమ్మనబోయిన రాజేష్, తేరా జ్ఞానవతి, దేవరకొండ సతీష్, వల్లూరు చైతన్య వర్మ, పొంగులేటి బాలస్వామి, గుంపుల లాజరు, బావిశెట్టి స్వామి, కాళీ సోనీ ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి, మండవల్లి మండల ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, రాష్ట్ర ఎస్సీ విభాగ కార్యదర్శి గుమ్మడి వెంకటేశ్వరరావు, మండవల్లి మండల అధ్యక్షుడు బేతపూడి ఏసేపురాజు, నాయకులు వాసురాజు, ఎనిగళ్ల రాము, ప్రసాద్, జ్యోతిబాబు,కొండారెడ్డి, కైకలూరు మండల అధ్యక్షుడు సమయం సింగంశెట్టి రాము, సమయం అంజి, సుందరరావు, జాన్‌వెస్లీ, పవన్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఏలూరు జిల్లా ఐటీ విభాగ ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్‌రావు డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని కాలక్షేప మండపంలో గణపతి నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 27వ తేదీ నుంచి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. స్వామి వారి అలంకారాల్లో భాగస్వాములు కాదలచిన భక్తులు రూ. 1,116 చెల్లించాలని తెలిపారు. నవరాత్రి పూజల్లో పాల్గొనే భక్తులు రూ. 200 చెల్లించి తమ గోత్రనామాలను తెలిపి ప్రత్యేక పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎస్.రాజేష్, సభ్యులు ఎ. సుశీల, వి. పోతురాజు, వి. శైలజ, ఆలయ అర్చకులు కపిలవాయి గోపాలశాస్త్రి, సిబ్బంది మురళి, నారాయణ పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికలను విడుదల చేసిన కమిటీ సభ్యులు



సత్యదేవుని ఆలయం

సత్యదేవుడి ఆలయానికి హంగులు

గుడ్లవల్లేరు సంతరోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయాన్ని దాతల సహకారంతో అత్యంత సుందరంగా గ్రామస్తులు తీర్చుదిద్దుతున్నారు. ఈ ఆలయిన్న రెండో అన్నవరంగా భక్తులు విశ్వసిస్తారు. ఈ ఆలయానికి వందేళ్ల చరిత్ర కలదు. అన్నవరం తర్వాత స్వామివారు ఇక్కడే భక్తులకు ఎక్కువగా దర్శనమిస్తారని భక్తుల విశ్వాసం. అలాంటి ఖ్యాతి గాంచిన ఆలయానికి దాతలు విరాళాలు సమర్పిస్తున్నారు. గ్రామస్తుల సమష్టి సహకారంతో ఆలయ ముఖ మండపం, గర్భాలయం, ఆలయ విస్తరణ పనులను చేపట్టారు. చేయి తిరిగిన కళాకారులతో స్వామివారి గర్భాలయంతో పాటు మండపంలో తీర్చి దిద్దబడిన దశావతారాలు, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, గరుత్మంతుడు, వివిధ దేవతామూర్తుల విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

– గుడ్లవల్లేరు



నిర్మాణంలో ఉన్న స్వామివారి గర్భాలయం



ముఖ మండప ద్వారం

గుర్రపుడెక్కను వెంటనే తొలగించండి

మొవ్వ: డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను పూర్తిస్థాయిలో యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మండల పరిధిలోని కాజ, చిన ముత్తేవి గ్రామాల్లో అయినంపూడి డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నాట్లు వేసిన పొలాలు నీట మునిగాయన్నారు. వేసవిలో డ్రెయిన్లలో పూడిక తీస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలుగా మిగిలాయన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



అయినంపూడి డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క